క్లుప్తంగా

ఘాట్ రోడ్డులో ప్రమాదం



ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైన లారీ

తిరుపతి క్రైమ్: తిరుపతి నుంచి తిరుమలకెళ్లే రెండో ఘాట్ రోడ్లో ఓ లారీ అదుపుతప్పి ప్రమాదానికి గురైన ఘటన బుధవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్తున్న హెవీ ట్రక్ లారీ ఫ్రంట్ వీల్ కట్టవ్వడంతో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

తిరుపతి లీగల్ : చెక్ బౌన్స్ కేసులో చంద్రగిరిలోని బ్రాహ్మణ వీధికి చెందిన వి.మైఖేల్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి సంధ్యారాణి గురువారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరపు న్యాయవాది బి.నరహరరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్‌లోని గాంధీపురానికి చెందిన ఓ.బాలాజీ వద్ద ఆర్టీసీ ఉద్యోగి వి.మైఖేల్ 2016 అక్టోబర్ 15వ తేదీ రూ.2 లక్షలు అప్పుగా తీసుకుని నోటు రాసి ఇచ్చా డు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో అతను 2017 జనవరి 20వ తేదీన ఓ చెక్కును బాలాజీకి ఇ చ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయ గా అది బౌన్స్ అయింది. దీంతో అతను మైఖేల్‌పై చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూ ర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి మైఖేల్ కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే చెక్కు సొమ్ము రూ.2 లక్షలను పరిహారంగా చెల్లించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

సదుపాయాలు కల్పించండి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌ఓ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ఆశ డిమాండ్ చేశారు. తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్లో గురువారం సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు ఫీజుల పేరుతో అడ్డగోలుగా దోచుకుంటూ తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే ఫీజు దోపిడీని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు స్రవంతి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా రెవెన్యూ కార్యాలయాలు

తిరుపతి అర్బన్: జిల్లాస్థాయి, మండల తహసీల్దార్ల వరకు గురువారం స్థానిక అధికారులు ఎవరూ రెవెన్యూ కార్యాలయాలకు రాలేదు. ఈ సమాచారం తెలియక ఉదయం నుంచి సాయంత్రం వరకు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టరేట్ కార్యాలయాల వద్ద జనం పడిగాపులు కాశారు. ముందస్తు సమాచారం ఉంటే ఇక్కడ ఎందుకు వేచి చూస్తామంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

29 నుంచి తిరువడిపురం ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 29 నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు శ్రీఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ఘనంగా జరగనుంది. ఇందులో భాగంగా ఉత్సవ రోజుల్లో ఉదయం శ్రీఆండాళ్ అమ్మవారికి తిరుమంజనం, సాయంత్రం ఆస్థానం నిర్వహిస్తారు. ఆగస్టు 7న శ్రీఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీగోవిందరాజస్వామి వారు, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీగోవిందరాజస్వామి వారు, శ్రీఆండాళ్ అమ్మవారిని అలిపిరికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ స్థానం చేపడతారు. అనంతరం అలిరిపి నుంచి రామనగర్ క్వార్టర్స్‌లోని గీతామందిరం, ఆర్ఎస్ మాడవీధిలోని ఆలయం, శ్రీచిన్నజీయర్ మఠం మీదుగా ఊరేగింపు, తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. రాత్రి 8 గంటలకు శ్రీఆండాళ్ అమ్మవారి సన్నిధిలో శాత్తుమొర నిర్వహిస్తారు.

యశోదమ్మకు నివాళులు



యశోదమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, నేతలు

తిరుపతి కల్చరల్: ఎంఆర్‌సీ రెడ్డి తల్లి యశోదమ్మ కర్మక్రియలు సందర్భంగా పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, మేయర్ డాక్టర్ శిరీష గురువారం నివాళులు అర్పించారు. అలాగే రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నేతలు హాజరై సంతాపం వ్యక్తం చేశారు.

మార్కెట్లోకి పల్సర్ ఎన్ఎస్ 400



తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఎంజీబీ బజాజ్ షోరూంలో గురువారం బజాజ్ పల్సర్ ఎన్ఎస్400 స్కూటర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. అనంతరం షోరూం నుంచి చంద్రగిరి కోట వరకు బ్రేక్ ఫాస్ట్ రైడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బజాజ్ ఆటో సంస్థ ఏరియా సేల్స్ మేనేజర్ అశోక్‌కుమార్‌రెడ్డి బజాజ్ పల్సర్ ఎన్ఎస్400 బైక్‌ను కేవలం రూ.1.85 లక్షలకే ఎక్స్ షోరూం ధరకు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఏజీఎం శ్రీనివాస్, రైడర్ వంశీ, సర్వీస్ మేనేజర్ రెడ్డెప్ప, శేఖర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా మాజీ సీఎం జగన్

- చంద్రగిరి నియోజకవర్గంలో 30 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు చెక్కులు
- టీడీపీ దాడుల్లో గాయపడిన వారికి ఆర్థికసాయం
- 29న బాధితుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయనున్న చెవిరెడ్డి



తిరుపతి రూరల్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడిన విషయం విదితమే. కూటమి నేతల దాడుల్లో గాయపడిన వారికి, ఆస్తులు పోగొట్టుకున్న వారికి, ఆర్థికంగా నష్టపోయిన వారికి మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. దాడుల్లో గాయపడిన వారికి ఆస్పత్రి ఖర్చులకు, ఆస్తులు కోల్పోయిన వారికి పార్టీ తరఫున ఆర్థికంగా ఆదుకోవడానికి సిద్ధమయ్యారు. చంద్రగిరి నియోజకవర్గంలో 30 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెక్కులు పంపించారు. ఈ చెక్కులను సోమవారం నుంచి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి స్వయంగా బాధితుల ఇళ్లకు తీసుకు వెళ్లి పంపిణీ చేస్తారు.

జగనన్న భరోసా.. చెవిరెడ్డి కృషి..

టీడీపీ దాడుల్లో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల వివరాలతో పాటు చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు చేసిన అరాచకాలను ఎప్పటికప్పుడు అధినేత జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి తీసుకెళ్లారు. దాడుల్లో రక్త గాయాలకు గురైన, ఆస్తులు కోల్పోయిన ప్రతి ఒక్కరికి ఆర్థిక సాయమే కాకుండా అండగా ఉంటాం అని పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి నుంచి భరోసా అందించేలా చెవిరెడ్డి చొరవ తీసుకున్నారు.

బాధితులకు అండగా వైఎస్సార్‌సీపీ

చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా మే 5వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు జరిగిన రాజకీయ కక్ష సాధింపు దాడుల్లో గాయపడిన వారి వివరాలు.. చంద్రగిరి మండలం నుంచి ఎస్.మస్తాన్, కొటాల చంద్రశేఖర్ రెడ్డి, మస్తాన్, విరూపాక్షి హేమంత్, ఎస్.సాధిక్, సక్కూరు వంశీ, అంగేరి రాజశేఖర్ రెడ్డి, ఎస్.ఆసీఫ్, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎం.వినోద్ కుమార్, మల్లం వివేక్ రెడ్డి, కుమార్ ఆచారి, కత్తి అబ్బులు, ఎ.సాయికిరణ్ , పాకాల మండలం నుంచి ఎస్.యువరాజు, టి.గంగయ్య, పి.సతీష్ కుమార్, తిరుపతి రూరల్ మండలం నుంచి వి.అశోక్ రెడ్డి, పీఎం లక్ష్మీనారాయణ, రమేష్ మొదలియార్, మహ్మద్ బాషా, ఎ.రాజీవ్, పి.శేఖర్, రామచంద్రాపురం మండలం నుంచి ఎం.మురగయ్య, ఎం.సుబ్రమణ్యం, కె.దొరస్వామి, ఎస్‌పీ మధు, ఆర్. కుప్పుస్వామి, హరి, చిన్నగొట్టిగల్లు మండలం నుంచి డి.ఇర్షాద్ ఉన్నారు.

ఘనంగా పీసీ రాయలు జన్మదిన వేడుకలు

– టీటీడీ అన్నదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం



పేదలకు అన్నదానం చేస్తున్న డాక్టర్ పీసీ.రాయులు

తిరుపతి కల్చరల్: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయలు జన్మదిన వేడుకలు గాంధీ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం టీటీడీ అన్నదాన ట్రస్ట్‌కు డాక్టర్ పీసీ.రాయలు రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు టీటీడీ ఈఓ శ్యామలరావును కలిసి ఆయనకు విరాళం అందించారు. అనంతరం బైరాగిపట్టెడలోని జాస్మిన్ వృద్ధాశ్రమంలో వృద్ధులు, పేదలకు అన్నదానం చేశారు. అలాగే కేశవాయనిగుంటలోని గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకగా త్యాగరాజ సంగీతోత్సవాలు



సంగీత కచేరి ప్రదర్శిస్తున్న గురుచరణ్ బృందం

తిరుపతి కల్చరల్: శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 80వ వార్షిక త్యాగరాజ మండపంలో ఐదు రోజుల పాటు తలపెట్టిన త్యాగరాజ సంగీతోత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంగీత విద్వాంసుడు, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కె.శివరామన్ ముఖ్య అతిథిగా హాజరై ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగరాజస్వామి పేరుతో ఏటా సంగీతోత్సవాలను నిర్వహిస్తూ ఆయన సంగీతం విశిష్టతను నేటి తరానికి అందించడం అభినందనీయమన్నారు. అనంతరం తొలిరోజు సంగీత కళాకారుడు నిఖిల్ గురుచరణ్ బృందం ప్రదర్శించిన సంగీత కచేరీ సభికులను అలరింపజేసింది. కార్యక్రమంలో త్యాగరాజ ఉత్సవ కమిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మోహన్ సుందరం, కోశాధికారి భానుమూర్తి, కార్యదర్శి కంచి రఘురామ్, ప్రభాకర్, భీమాస్ అశోక్, పలువురు కళాకారులు, కళాభిమానులు, ప్రజలు, సంగీత ప్రియులు హాజరయ్యారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న హరేకృష్ణ నేత్రాలయ వైద్యులు

తిరుపతి రూరల్: పేరూరు పంచాయతీలో శ్రీకృష్ణ ద్రౌపదీ ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రముఖ భాగవతారి మునిలక్ష్మి భీష్మ అస్తనిష్క్రమణ ఘట్టాన్ని హరికథ ద్వారా ఆలపించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో కీచకవధ నాటకం ప్రదర్శన జరిగింది. ఉత్సవాల సందర్భంగా హరేకృష్ణ నేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 238 మందికి ఉచితం కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి అరుణాచలరెడ్డి మాట్లాడుతూ మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఈనెల 28వ తేదీ దుర్యోధన వధ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆలయ కమిటీ పెద్దలు మట్టా మోహన మునిసిద్దారెడ్డి, మూలం సుదర్శనరెడ్డి, ముకుందరెడ్డి పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలను పాటించండి



వేమూరు భూముల్లో పెట్టిన హెచ్చరిక బోర్డు ముందు నిరసన తెలుపుతున్న దళితులు

తిరుపతి రూరల్: దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్న భూముల్లో రాజకీయ ఒత్తిళ్లతో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగించాలని వేమూరు దళిత రైతులు వేడుకున్నారు. ఆ మేరకు గురువారం సాగు భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు వద్ద వారు నిరసన తెలిపారు. వారికి ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుణ్యమూర్తి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 299, 298లో 7.14 ఎకరాల భూమిని దళిత కుటుంబాలు వ్యవసాయం చేసుకుంటున్నాయని తెలిపారు. వేమూరు గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు చెప్పారని రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా వ్యవసాయ భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. దళిత రైతులను ఇబ్బంది పెట్టొద్దని 2022లోనే హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అదే విషయాన్ని తిరుపతి రూరల్ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోకు కోర్టు ఆదేశాలను అందించామన్నారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్డీఓ స్పందించి దళిత రైతుల భూముల్లో పెట్టిన హెచ్చరిక బోర్డులను తొలగించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 73,023 మంది స్వామివారిని దర్శించుకోగా 26,942 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.98 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అభ్యుదయానికి చిరునామా అడిగోపుల



అడిగోపులకు నివాళులు అర్పిస్తున్న సాహితీ సంస్థల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: అభ్యుదయానికి చిరునామాగా ప్రముఖ రచయిత అడిగోపుల వెంకటరత్నం సాహిత్యం నిలుస్తుందని పలువురు వక్తలు కొనియాడారు. తిరుపతి సాహితీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వేమన విజ్ఞానకేంద్ర సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం ప్రముఖ రచయిత అడిగోపుల వెంకటరత్నం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత రాసాని హాజరై మాట్లాడుతూ అడిగోపుల కవిత్వానికి నిలువెత్తు సంతకం అంటూ కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు వరించదగిన రచయిత అడిగోపుల వెంకటరత్నం అన్నారు. సీనియర్ పాత్రికేయుడు కొత్వాలు అమరేంద్ర, తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, తెలుగు భాషోద్యమ సమితి ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు మాట్లాడుతూ వచ్చే తరానికి ప్రేరణ అడిగోపుల కవిత్వం అని తెలిపారు. కార్యక్రమంలో అరసం నేతలు, సాహితీవేత్తలు, అడిగోపుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

రామచంద్రాపురం: ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ఆచరించేలా ప్రోత్సహించాలని తిరుపతి జిల్లా అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని రాయలచెరువుకట్ట దిగువున ఉన్న రాయల మండపంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇటీవల బెంగళూరులో నిర్వహించిన సౌత్ జోన్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు తిరుపతి లోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశా ల ఎంపీసీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని పి.భవ్య సీనియర్ బాలికల 58 కేజీ విభాగంలో పాల్గొని బంగారు పతకం సాధించింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

బలిజలను ఆదుకోండి

తిరుపతి కల్చరల్: సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో వెనుకబాటుతనానికి గురవుతున్న బలిజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక బలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రాయల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిమాండ్లతో కూడిన కరపత్రాలను ప్రదర్శించారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు రూ.5 వేల కోట్ల నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాయల్ పీపుల్స్‌ఫ్రంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసుల ఉపసంహరణపై ఉద్యోగుల హర్షం

తిరుపతి(అలిపిరి): సీపీఎస్ ఉద్యోగులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడంపై ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ చీర్ల కిరణ్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు వి.పవన్, తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలు జి.రేఖ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన జీపీఎస్ చట్టాన్ని సైతం రద్దు చేస్తూ ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు.

టైంస్కేల్ నూతన అసోసియేషన్ ఎన్నిక



మధుసూదన్ నాయుడు, గోపి

తిరుపతి సిటీ: ఎస్వీయూ నాన్‌టీచింగ్ టైం స్కేల్ ఎంప్లాయిస్ నూతన అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం వర్సిటీ ఆవరణలో జరిగిన సమావేశంలో టైంస్కేల్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడిగా మధుసూదన్‌నాయుడు, కార్యదర్శిగా గోపిని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సోమ సుందరం, జాయింట్ సెక్రటరీగా కే.రమేష్‌నాయుడు, ట్రెజరర్‌గా మురళీ కృష్ణారెడ్డితో పాటు 15మందికి పైగా ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు.

ఫుట్‌బాల్ చాంపియన్‌గా అనంతపురం జట్టు



చాంపియన్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో గత మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల అండర్–14 బాలికల ఫుట్‌బాల్ టోర్నీ గురువారం ముగిసింది. తిరుపతి, అనంతపురం జిల్లాల జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం బాలికల జట్టు విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకులు, అధికారులు చాంపియన్ జట్టుకు ట్రోఫీని అందించి అభినందించారు.

లెప్రసీపై అవగాహన

తిరుపతి మంగళం: లెప్రసీ కేసులపై మరింత అవగాహన కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. గురువారం మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ప్రతి ఇంటికీ ఆశా కార్యకర్తలు వెళ్లి ఎవరికైనా చర్మంపై మచ్చలు ఉంటే అటువంటి వారిని లెప్రసీ అనుమానితులుగా గుర్తించాలన్నారు. మంగళం పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యలు అర్థరహితం

తిరుపతి కల్చరల్: సంక్షేమ పాలన అందించి యావత్ ప్రజల గుండెల్లో సంక్షేమ సారథిగా నిలిచిన చరిత్ర డాక్టర్ వైఎస్సార్, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బీజేపీ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరమని వైఎస్సార్ వీరాభిమాని బొమ్మగుంట రవి ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీలో సీనియర్ నేత, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కడుపుకు అన్నం తినేవాళ్లు ఎవరూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేయరని మాట్లాడుతుంటే ఆ సభలో సీఎం చంద్రబాబు, స్పీకర్, తోటి ఎమ్మెల్యేలు నవ్వుకోవడం సిగ్గుచేటన్నారు. అధికారం కోసం, దోపిడీ కోసం కుమ్మక్కై సీట్లు పంచుకున్న వారు హేళన చేస్తే వైఎస్సార్‌సీపీకి నష్టం లేదన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

తిరుపతి సిటీ: యువత ప్రాణాంతకమైన మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలలో తిరుపతి సెట్విన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం, సాంకేతిక నేరాలు, మహిళల రక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారిన పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోకూడదని సూచించారు. అనంతరం మహిళా పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ గిరిజ మహిళల రక్షణ, నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెట్విన్ అసిస్టెంట్ మేనేజర్ చక్రి నాయక్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భాకరాపేట : స్విమ్స్ సహకారంతో శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని చిన్నగొట్టిగల్లు, దేవ్‌దార్లపల్లె సచివాలయాల పరిధిలో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గురువారం జరిగిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు స్థానిక ప్రజలు హాజరయ్యారు. పింక్ బస్సు ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా చేపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మనోహర్, ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మదనమోహనరాజు, వైద్యులు, స్విమ్స్ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అభినయ నాటకోత్సవం



మైరావణ పద్యనాటకంలోని దృశ్యం

తిరుపతి కల్చరల్: అభినయ ఆర్ట్స్ జాతీయస్థాయి నాటక, నృత్య పోటీలలో భాగంగా మహతి కళాక్షేత్రంలో గురువారం ప్రదర్శించిన పౌరాణిక, సాంఘిక నాటికలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరింపజేశాయి. నృత్య పోటీలలో కళాకారులు అద్భుత రీతిలో శాస్త్రీయ, జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులను అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్.రెడ్డి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

ఈస్ట్ పీఎస్‌లో ఆకస్మిక తనిఖీలు



ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ఎస్పీ

తిరుపతి క్రైమ్: జిల్లావ్యాప్తంగా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు గురువారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో అనుమానిత వ్యక్తులను ఆరా తీశారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు పెంచి అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు ఈస్ట్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఐ మహేశ్వర్ రెడ్డికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

వీసీ, రిజిస్ట్రార్లకు సన్మానం



వీసీ, రిజిస్ట్రార్లను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ నూతన వీసీ డాక్టర్ అప్పారావును, రిజిస్ట్రార్ భూపతి నాయుడును వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతు మురళీధర్ గురువారం ఘనంగా సన్మానించారు. వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని, గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వర్సిటీలో కొనసాగించాలని వారు అధికారులను కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరారెడ్డి, బాలాజీ, హరి, శివ, ముని, రమణ, అనీల్, పాపిరెడ్డి, రాముడు పాల్గొన్నారు.

బీసీఎం విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బీసీఎం విద్యార్థులు

తిరుపతి మంగళం: మంగళం పరిధిలోని బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్(బీసీఎం స్కూల్)లో ఈ నెల 23న నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–12, అండర్–14 బాల బాలికల జంప్ రూప్ పోటీలలో బీసీఎం విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లాస్థాయి అండర్–12, అండర్–14లలో పోటీపడి రాష్ట్రస్థాయి పోటీలకు బీసీఎం విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్–12లో బాలికలు–4, బాలురు–6, అండర్–14లో బాలికలు–9, బాలురు–2 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా విద్యార్థులను పీఈటీ ప్రమీన బీసీఎం పాఠశాల వ్యవస్థాపకులు కృష్ణమూర్తి నాయుడు, కరస్పాండెంట్ ప్రియా అభినందించారు.